ADMISSIONS ARE IN PROGRESS 2024-25
Secretary & Correspondent
Bikki Venkateshwarlu
M.Sc (Physicis), M.Ed.
Join your kids with us & Empower their Academic Excellence with Ethical Foundations
INDIRA VIDYALAYA
Nursery to VII class, English Medium
Near Bodrai, Mahabubabad.
Cell: 9701912300, 9705412300

దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 282 సోమవారం 07-10-2024 | ఎడిటర్ : వేముల అయోధ్య రాములు | జీలు : 4 | వెల : 5 రూ/..

# ఎవరు అడ్డొచ్చినా ఆగదు..

మూసీ ప్రక్షాళన చేసి తీరతాం

తరాల తరబడి పేదలు మురికిలోనే జీవించాలా?

వారి జీవన విధానంలో మార్పు రావద్దా?

ఇళ్లు కోల్పోయేవారి బాధలు నాకు తెలియవా?


హరీశ్, కేటీఆర్, ఈటలను వారం రోజులు

పేదల మధ్య ఉంచితే సమస్యలు అర్థమవుతాయి

రూ.లక్ష కోట్ల కాళేశ్వరం ఏమైందో చూశాం

ముఖం చెల్లక కేసీఆర్ ఎక్కడున్నారో!: సీఎం

1635 మందికి నియామక పత్రాల అందజేత



**తొలి సమయం, ప్రధాన ప్రతినిధి హైదరాబాద్**

మూసీలో మురికిని తొలగించేందుకే ప్రక్షాళన కార్యక్రమం చేపట్టామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఎవరు అడ్డొచ్చినా ఇది ఆగదని స్పష్టం చేశారు. దీనిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నవారు.. ఏళ్ల తరబడి మూసీ మురికి కూపంలో జీవిస్తున్న వారి గురించి ఆలోచించాలన్నారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో దుర్భర జీవితం గడుపుతున్న పేదల బాధలు అర్థం చేసుకోరా? తరాలన్నీ మూసీ మురికిలోనే జీవించాలా? వారి జీవన విధానంలో మార్పు రావద్దా? అని ప్రశ్నించారు. తాను జడ్పీటీసీ నుంచి ఇక్కడిదాకా వచ్చానని, పేదల మధ్యనే ఉంటూ.. వారి ఇబ్బందులు తెలుసుకోలేనా? అని అన్నారు. ఇల్లు కోల్పోయిన నిరుపేద కుటుంబాల బాధలు తనకు అర్థమవుతాయన్నారు. ఆదివారం.. రెసిడెన్షియల్ స్కూళ్ల ప్రిన్సిపాళ్లు, సివిల్, ఈఎన్‌సీ, మిషన్ భగీరథ, ప్రజారోగ్య, మునిసిపల్, గిరిజన సంక్షేమ, ఆర్‌అండ్‌బీ విభాగాలకు సంబంధించిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అగ్రికల్చర్ ఆఫీసర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు, లైబ్రేరియన్ పోస్టులకు ఎంపికైన 1,635 మందికి ప్రభుత్వం నియామక పత్రాలు అందజేసింది. ఈ సందర్భంగా శిల్పకళా వేదికలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "గంగా, యమున, సరస్వతి, కావేరి వంటి నదుల పేర్లను మన ఆడబిడ్డలకు పెట్టుకుంటున్నాం. మూసీ నది కంపు కొడుతూ, విషం చిమ్ముతుంది కాబట్టే ఆపేరు ఎవరూ పెట్టుకోవడంలేదు. ఆ మూసీ మురికిని నేను ప్రక్షాళన చేయాలనుకుంటున్నా. ఇందులో యువ ఇంజనీర్లు భాగస్వామ్యమై ప్రపంచానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలి. గతంలో ప్రాజెక్టులు కట్టినప్పుడు నిర్వాసితులు కాలేదా? మల్లన్నసాగర్ భూ నిర్వాసితులను కొట్టించారు కదా? మూసీ పరివాహక ప్రాంతాల్లో పదివేల కుటుంబాలున్నాయి. నిర్వాసితులను ఎలా ఆదుకోవాలో సలహా ఇవ్వండి. నష్ట పరిహారం ఎలా ఇద్దామో చెప్పండి. ఇప్పటికే గుడిసెల్లో ఉన్నవారిని డబుల్ బెడ్రూమ్ ఇళ్లల్లోకి తరలిస్తూ.. దారి ఖర్చులకు కూడా రూ.25 వేలు ఇస్తున్నాం. బఫర్ జోన్‌లో ఉన్నవారిని ఎలా ఆదుకోవాలన్న దానిపై ఆలోచిస్తున్నాం.

**10 వేల కోట్లు ఖర్చు చేయగలిగితే..**

నువ్వు(కేసీఆర్) రూ.7 లక్షల కోట్లు అప్పు చేసినవ్. రూ.5 వేల కోట్ల నుంచి రూ.10 వేల కోట్లు మూసీలో ఉన్న పేదలకు ఖర్చు చేయగలిగితే.. వాళ్లకు ప్రభుత్వ స్థలాల్లో కాలనీ, అపార్టుమెంట్లు, మంచి ఇళ్లు కట్టించి, హాస్పిటల్, పాఠశాలలు, కాలేజీలు కట్టించవచ్చు. మీకు రూ.2 వేల కోట్ల విలువ చేసే వెయ్యెకరాల ఫామ్‌హౌస్ ఉంది. మీ పార్టీ ఖాతాలో రూ.1500 కోట్లు ఉన్నాయి. పార్టీ పెట్టినపుడు 15 రూపాయల్లేవు.. ఇప్పుడు ఇన్ని కోట్లు మీ ఖాతాలకు రావడానికి పేదోళ్ల త్యాగం కారణం కాదా? ఈ ప్రభుత్వం మనందరిది. ఉద్యోగాలు సాధించిన వారంతా బాధ్యతతో పనిచేయండి. మనం చేసే నిర్మాణం పూర్తయితే వాళ్లు చేసిన దోపిడీ అంతా ప్రజలకు తెలుస్తుందని.. ముందుకు సాగనియ్యకుండా ప్రయత్నం చేస్తున్నారు. బుల్డోజర్ నా మీదుగా పోవాలంటే.. నా మీదుగా పోవాలంటూ హరీశ్‌రావు, కేటీఆర్.. ఇలా అందరూ పోటీ పడుతున్నారు. మీకోసం ఎన్ని బుల్డోజర్లు కొనాలె? పైసలు యాడున్నయి? మూసీ అంచున ఉండే దోస్తులకు ఒకటే సూచన. హరీశ్, కేటీఆర్, రాజేందర్ ఎవరైనా వస్తే పట్టుకొని ఒక వారం రోజులు పేదోళ్ల మధ్యన ఉంచండి. వాళ్ల కష్టాలు తెలుస్తయి. వాళ్లకు ఏం మేలు చేయాలో అప్పుడు అర్థమవుతుంది. ఏం చేసినా తప్పుబట్టాలని, కాళ్ల మధ్య కట్టె పెట్టాలని కొంతమంది బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారు. మనం పైసలు పెట్టి పని చేస్తే.. తెలంగాణ బాగుపడితే.. గతంలో వాళ్లు చేసిన దోపిడీ ప్రజలకు అర్థమవుతుందని అన్నింటినీ అడ్డుకుంటున్నారు.

**వందేళ్ల అనుభవం..!**

వందేళ్ల అనుభవం ఓవైపు ఉంటే.. పదేళ్ల దుర్మార్గమైన అనుభవం మరోవైపు ఉంది. కాంగ్రెస్ పాలనకు, బీఆర్ఎస్ పాలనకు ఎంతో వ్యత్యాసం ఉంది. గత ప్రభుత్వం 2017లో నోటిఫికేషన్ ఇచ్చి ప్రిన్సిపాళ్లను, పీఈటీలను ఎందుకు నియమించలేదు? 2019 పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించిన వినోద్‌కుమార్‌కు, కవితకు ఆరు నెలలు తిరగకుండానే పదవులు కట్టబెట్టారు. వారి కుటుంబానికి ఒక నీతి, మన కుటుంబాలకు మరో నీతి ప్రదర్శించారు. ఇదే ఆ కుటుంబం రీతి. వివిధ శాఖల్లో కొన్ని ఉద్యోగాలకు 2017లో నోటిఫికేషన్ ఇస్తే.. మరికొన్ని రెండేళ్ల కిందట నోటిఫికేషన్ ఇచ్చారు. కానీ, ఉద్యోగ నియామకాల గురించి మాత్రం పట్టించుకోలేదు. వివిధ న్యాయస్థానాల్లో కేసులుంటే వాటికి పరిష్కారం చూపించలేకపోయారు. కొందరు ఎనిమిదేళ్లు, మరికొందరు రెండేళ్లుగా నిరీక్షించి గత ప్రభుత్వంపై విశ్వాసం కోల్పోయారు.

# మళ్లీ వీఆర్‌వోల సేవలు..

ప్రతి రెవెన్యూ గ్రామానికి ఓ అధికారి

కొత్త చట్టం రాకముందే పునరుద్ధరణ

దేశానికి రోల్‌మోడల్‌గా రూపకల్పన

ఉద్యోగుల జాబ్ చార్టుకు కమిటీ

17 మంది అధికార్లకు ఐఏఎస్ హోదా

స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లతో భేటీలో రెవెన్యూ మంత్రి పొంగులేటి వెల్లడి



**తొలి సమయం, ప్రధాన ప్రతినిధి హైదరాబాద్**

రాష్ట్రంలో మళ్లీ వీఆర్వో, వీఆర్ఏల సేవలను వినియోగించుకోనున్నట్లు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేసి.. సామాన్యుడికి అందుబాటులో ఉండేలా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమిస్తామని, కొత్త రెవెన్యూ చట్టం రాకముందే దీనిపై తుది నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ఆదివారం రాష్ట్రంలోని 272 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లతో ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీఐలో మంత్రి పొంగులేటి ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం తొందరపాటు నిర్ణయాలతో రెవెన్యూ వ్యవస్థను భ్రష్టు పట్టించిందని, సామాన్యులకు రెవెన్యూ సేవలను దూరం చేసిందని ఆరోపించారు. మళ్లీ అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా ఉద్యోగులను, మేధావులను సంప్రదించి వారి సూచనలు, సలహాలు స్వీకరించామన్నారు. తెలంగాణ కొత్త రెవెన్యూ చట్టాన్ని దేశానికి రోల్ మోడల్‌గా ఉండేలా తీసుకువస్తున్నట్టు తెలిపారు. గత ప్రభుత్వం అమలు చేసిన ధరణితో ఎదురైన కష్టాల నుంచి విముక్తి కల్పించేలా దీనిని రూపొందిస్తున్నట్టు పేర్కొన్నారు. కొత్త చట్టానికి సంబంధించి నల్లగొండ జిల్లాలోని తిరుమలగిరి, రంగారెడ్డి జిల్లాలోని యాచారం మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్ చేపడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ భూముల రికార్డులు టాంపరింగ్‌కు గురికాకుండా డిజిటలైజేషన్ చేయనున్నట్లు ప్రకటించారు.

**ఉద్యోగులందరికీ శిక్షణ..**

కొత్తగా ఉద్యోగంలో చేరిన వారితోపాటు సర్వీసులో ఉన్న ప్రతి ఒక్కరికీ శిక్షణ ఇస్తామని మంత్రి పొంగులేటి చెప్పారు. ఉద్యోగులకు జాబ్ చార్ట్ రూపొందించాలని, దీనిపై కమిటీని ఏర్పాటు చేసి ఇతర రాష్ట్రాల్లోని విధానాలను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. ఉద్యోగుల సంబంధించి పదోన్నతుల వంటి ఆర్థికేతర సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామన్నారు. ఇక రాష్ట్రంలోని 33 జిల్లాల్లో సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులను కొత్తగా తీసుకువస్తామని, అలాగే 17 మంది సీనియర్ అదనపు కలెక్టర్ క్యాడర్ అధికారులకు ఐఏఎస్ హోదా కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఎన్నికల సమయంలో బదిలీ అయిన తహసీల్దార్‌లను పూర్వ స్థానాలకు బదిలీ చేయడానికి దసరాలోపే నిర్ణయం తీసుకుంటామన్నారు. వాహనాల అద్దెలను ఈ నెలాఖరు వరకు 50 శాతం క్లియర్ చేస్తామన్నారు. గత ప్రభుత్వం మండలాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాలను పెంచింది తప్ప.. అక్కడ మౌలిక సదుపాయాలు కల్పించలేదని మంత్రి ఆరోపించారు. దాదాపు 200 మండలాలకు సొంత భవనాలు లేవన్నారు.

# రెండు యుద్ధాలు జరుగుతుంటే.. ఐక్యరాజ్యసమితి ఎక్కడ?



**న్యూఢిల్లీ, అక్టోబరు 6:**

ప్రపంచంలో నేడు రెండు యుద్ధాలు జరుగుతుంటే.. ఐక్యరాజ్యసమితి ఎక్కడుందని భారత విదేశాంగమంత్రి ఎస్.జైశంకర్ ప్రశ్నించారు. ఉక్రెయిన్-రష్యా, ఇజ్రాయిల్-హమాస్ యుద్ధాలను ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో మూడు రోజులు నిర్వహించిన కౌటిల్య ఎకనమిక్ కాంక్లేవ్‌లో చివరిరోజైన ఆదివారం ఆయన ప్రసంగించారు. యుద్ధాలు జరుగుతుంటే ఐక్యరాజ్యసమితి ప్రేక్షక పాత్రకే పరిమితమైందని, మార్కెట్‌లో మనుగడలేని ఒక పాత కంపెనీలాగా దాని తీరు ఉందని జైశంకర్ వ్యాఖ్యానించారు. సంక్షోభాలను పరిష్కరించేందుకు ఐక్యరాజ్యసమితి ఏమీ చేయలేకపోతోందని పేర్కొన్నారు. భద్రతామండలిలో శాశ్వత, తాత్కాలిక సభ్యదేశాల సంఖ్యను పెంచడం సహా ఐక్యరాజ్యసమితిని సంస్కరించాలని గత కొన్నేళ్లుగా భారత్ డిమాండ్ చేస్తోంది.

**నవరాత్రులు కదా! ఉపవాసం చేస్తున్నా..**

ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్, హంగేరియన్-అమెరికన్ బిలియనీర్ జార్జ్ సోరోసలలో ఎవరితో డిన్నర్‌కు ప్రాధాన్యం ఇస్తారనే ప్రశ్నకు జైశంకర్ చమత్కారంగా సమాధానం ఇచ్చారు. ఓ వార్తా సంస్థ ఇంటర్వ్యూ సందర్భంగా జైశంకర్‌ను ఈ విధంగా ప్రశ్నించగా.. 'ప్రస్తుతం నవరాత్రులు కదా!.. నేను ఉపవాసంలో ఉన్నా' అని నవ్వుతూ జైశంకర్ సమాధానం ఇచ్చారు. కాగా, జార్జ్ సోరోస్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీని తీవ్రంగా విమర్శిస్తుంటారు. భారత వ్యతిరేక కార్యకలాపాలకు జార్జ్ సోరోస్ నిధులు సమకూరుస్తున్నారని బీజేపీ తరచుగా ఆరోపిస్తోంది.

# సీఎం రేవంత్‌కి ఎంపీ ఈటల ఘాటు లేఖ

**తొలి సమయం, ప్రధాన ప్రతినిధి హైదరాబాద్**

తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొలువు తీరింది. అనంతరం హైడ్రాను ఏర్పాటు చేసింది. దీని ద్వారా అక్రమ నిర్మాణాలు.. నదీ గర్భంలో అక్రమంగా నిర్మించిన నిర్మిణాలు కూల్చివేతలో దూకుడుగా వ్యవహరిస్తుంది. దీంతో ఇళ్లు కోల్పోయిన బాధితుల ఆవేదనను రేవంత్ రెడ్డి సర్కార్ పట్టించుకోవడం లేదంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. అలాంటి వేళ సీఎం రేవంత్ రెడ్డికి మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ ఆదివారం బహిరంగంగా లేఖాస్త్రం సంధించారు. తాను అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా పేదల అభ్యున్నతే లక్ష్యంగా కొట్లాడే వ్యక్తినని ఆయన స్పష్టం చేశారు. హైడ్రా సంస్థకు, హైదరాబాద్ ముంపు గురికాకుండా చూసేందుకు, మూసీ ప్రక్షాళనకు, మూసీను కొబ్బరినీళ్లలా చేసేందుకు, ఎకలాజికల్ బాలన్స్ కాపాడడానికి, విదేశీ పక్షులు రావడానికి, చేపలు పెంచడానికి, పిల్లలు ఈతకొట్టేల చెరువులు తయారు చేయడానికి నేను వ్యతిరేకం కాదని ఆయన తన లేఖలో పేర్కొన్నారు. చెరువు కన్నతల్లి లాంటిదని ఆయన అభివర్ణించారు. కానీ హైదరాబాద్‌లో ఉన్న ఏ చెరువు కూడా పక్షులకు, చేపలకు నిలయంలాగా లేవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కన్నతల్లి లాంటి ప్రేమను పంచి పాలలాంటి నీళ్లను ఇచ్చి జీవం పోసిన చెరువు ప్రస్తుతం భూగర్భంలో విషాన్ని నింపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇవి దుర్వాసననిస్తుందని చెప్పారు. ఆయా పరిసర ప్రాంతాల్లో ప్రజల రోగాలకు నిలయంగా మారిందన్నారు. ముందు ఈ చెరువుల్లో దుర్గంధాన్ని తొలగించాలని సీఎం రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా ఆయన సూచించారు. అలా చేయకుండా.. 4 దశాబ్దాల క్రితం ప్రభుత్వం ఇచ్చిన పట్టా భూముల్లో, ప్రభుత్వం అనుమతించిన లే అవుట్‌లలో ఇల్లు నిర్మించుకున్న నిరుపేద ప్రజలను భయబ్రాంతులకు గురి చేస్తూ మీరు చేస్తున్న అడ్డగోలు కూల్చివేతలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నానని ఎంపీ ఈటల కుండ బద్దలు కొట్టారు. వారు గొల్లున ఏడుస్తునా, కాళ్ళమీద పడ్డా వదిలిపెట్టడం లేదన్నారు. వారు కడుపు కాలి మాట్లాడుతున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. డబ్బులు ఇస్తే కాదు.. పేదల చిరకాల స్వప్నం ఇళ్లు.. దొంగలలాగా దాడి చేసి మీరు చేస్తున్న కూల్చివేతలు.. ఇస్తున్న నోటీసులు ప్రజల కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని ఎంపీ



ఈటల రాజేందర్ రాసిన లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. చట్టప్రకారం, రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలంటూ సీఎం రేవంత్‌కు ఈ సందర్భంగా ఈటల రాజేందర్ సూచించారు. ముఖ్యమంత్రిగా మీకేమీ అపరిమిత అధికారాలు లేవని గుర్తు చేశారు. పేదలను ఇబ్బంది పెట్టడానికి కాదు మీకు అధికారం ఇచ్చిందన్నారు. పేదల పక్షాన కొట్లడడం తన కర్తవ్యమని స్పష్టం చేశారు.పదేళ్ళున్న కేసీఆర్ మూసీ ప్రక్షాళన చేస్తానని చేయలేదని గుర్తు చేశారు. మీరు మూసీ ప్రక్షాళన చేస్తానంటే అడ్డుకోమన్నారు. పట్టా భూములను కొనుక్కొని ఇల్లు కట్టుకొని ఉంటున్న వారిని బఫర్ జోన్ పేరుతో అక్రమంగా కట్టుకొని ఉంటున్నారని చిత్రీకరించడం దుర్మార్గమని ఆయన వ్యాఖ్యానించారు. పిడికెడు అక్రమ ఇళ్లను బూచిగా చూపి కోట్ల విలువ చేసే ఇళ్లను కూలగొడుతున్నారు. నివాసాలపై %=దీ-శ% అని రాస్తున్నారన్నారు. ఫణిగిరి కాలనీ, మారుతినగర్, చైతన్య పురి, ప్రజయ్ ఇంజనీరింగ్ సిండికేట్ లాంటి అపార్ట్‌మెంట్స్ అన్నీ పరిశీలించినట్లు వివరించారు. తాము ప్రజల మధ్య ఉన్నామన్నారు. మీకు తిరిగి చూసే టైం లేదన్నారు. తిరిగి చూసి.. వారి ఆక్రందనాలను ఆవిష్కరించే మమ్ముల్ని కాలకేయులుగా పోలుస్తున్నారని... ఇదేనా మీ భాష మీ సంస్కారం అంటూ సీఎం రేవంత్ రెడ్డిపై ఎంపీ ఈటల మండిపడ్డారు.

# బీజేపీ రాష్ట్రాల్లో ఉచిత కరెంటు ఇస్తారా?

ఇస్తే మీ తరఫున ప్రచారం చేస్తా

ప్రధాని మోదీకి కేజ్రీవాల్ సవాల్



**న్యూఢిల్లీ, అక్టోబరు 6:** దేశంలో బీజేపీ, దాని మిత్రపక్షాలు అధికారంలో ఉన్న 22 రాష్ట్రాల్లో ఉచిత కరెంటు ఇస్తారా అని ప్రధాని మోదీకి ఆప్ అధినేత, మాజీ సీఎం కేజ్రీవాల్ సవాల్ విసిరారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఆయా రాష్ట్రాల్లో ఉచితంగా కరెంటు ఇస్తే బీజేపీ తరఫున తాను ఎన్నికల ప్రచారం చేస్తానని ప్రకటించారు. ఫిబ్రవరిలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉందని.. దమ్ముంటే మహారాష్ట్ర, జార?ండ్‌లతో పాటే ఢిల్లీకీ నవంబరులో ఎన్నికలు జరపాలని మరో సవాల్ విసిరారు. ఆదివారం ఆయన ఢిల్లీలో నిర్వహించిన 'జనతా కీ అదాలత్' ర్యాలీలో ప్రసంగించారు. తన చేతిలో ఆరు స్వీట్ల ప్యాకెట్ పట్టుకున్నారు. ఈ ఆరూ ఢిల్లీ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పథకాలు.. ఉచిత విద్యుత్, ఉచిత నీరు, బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, వృద్ధులకు ఉచిత యాత్ర, ఉచిత ఆరోగ్యం, ఉచిత విద్య. తన చేతిలో ఉన్నటువంటి ప్యాకెట్లే ప్రజలకు పంచుతామని.. వాటిని వారు ప్రసాదంగా స్వీకరించాలని పిలుపిచ్చారు. పొరపాటున బీజేపీకి ఓటేస్తే ఈ ఉచిత ప్రయోజనాలు ఆగిపోతాయని హెచ్చరించారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఢిల్లీ రవాణా సంస్థ, ప్రభుత్వ స్కూళ్లు, ఆస్పత్రులను ప్రైవేటుకు అప్పగిస్తారని అన్నారు. రాష్ట్రాల్లో బీజేపీ 'డబుల్ ఇంజన్' ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. 'డబుల్ ఇంజన్ ప్రభుత్వాలంటే.. రెట్టింపు దోపిడీ, రెట్టింపు అవినీతి.. ద్రవ్యోల్బణం, నిరుద్యోగమే' అని కేజ్రీవాల్ అన్నారు. తాను జైల్లో ఉన్నప్పుడు ఇన్సులిన్ ఆపేశారని.. కిడ్నీలు దెబ్బతిని తాను మరణించేవాడినని అన్నారు.

# విజయవంతంగా డ్యూయల్ ఫెస్ట్

**చిన్నారుల చిత్రకళా ప్రతిభకు పట్టం కట్టడానికే సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ స్థాపన**

**డైరెక్టర్ సాగంటి మంజుల**





**తొలి సమయం హన్మకొండ, అక్టోబర్ 06**

హన్మకొండ పబ్లిక్ గార్డెన్ లో సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ ప్రతి నెల నిర్వహించే చిత్రకళా పోటీల్లో భాగంగా ఆదివారం డ్యూయల్ ఫెస్ట్ పేరుతో రెండు పోటీలు నిర్వహించారు.పెయింటింగ్ తో పాటు మట్టి బొమ్మల తయారీని నిర్వహించారు.సుమారు 60 మందికి పైగా చిన్నారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు అందజేసారు. అకాడమీ డైరెక్టర్ మంజుల మాట్లాడుతూ చిత్రకళా, శిల్పకళా చిన్నారుల ఏకాగ్రతను పెంచుతుందని, వారిలో ఉన్న నైపుణ్యాన్ని తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహించాలని, అకాడమీ స్థాపించిన ఉద్దేశం కూడా అదే అని తెలిపారు.తమ సంస్థ మూడు సంవత్సరాల నుండి చిన్నారులకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. చిన్నారులు ఈ దసరా సెలవులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మట్టితో చిన్న బొమ్మలు చేసి చిన్నారులు, పెద్దలు మురిసిపోయారు. ఈ కార్యక్రమంలో మంజులతో పాటు సంస్థ సలహాదారుడు నిమ్మల శ్రీనివాస్, ఆర్టిస్ట్ దూడపాక రమేష్, కార్టూనిస్ట్ చంద్ర, సాయి రామ్, సంజన పిల్లలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ని కలసిన జెఎస్ఆర్

**జెఎస్‌అర్ తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ సభ్యత్వ నమోదులో**

**రెండవ స్థానంలో ఉండటం పట్ల శుభాకాంక్షలు**

**తెలిపి శాలువాతో సత్కరించిన బండి సంజయ్**



**తొలి సమయం కరీంనగర్ అక్టోబర్ 06**

కరీంనగర్ మహాశక్తి ఆలయంలో శనివారం సాయంత్రం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా బీజేపీ సభ్యత్వ నమోదు లో తెలంగాణలో జె ఎస్ అర్ 4000 (నాలుగు వేలకు పైగా) పై చిలుకు సభ్యత్వాలతో రెండవ స్థానంలో ఉండటం పట్ల వారికి శుభాకాంక్షలు తెలిపి,శాలువా తో సత్కరించి,హర్షం వ్యక్తం చేశారు,బీజేపీ పార్టీ ని ప్రజల్లోకి తీసుకెళ్ళి సభ్యత్వ నమోదులో మొదటి స్థానంలో సురేందర్ రెడ్డి నిలవాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా జెఎస్అర్ మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజక వర్గంలోని నాయకులు, కార్యకర్తల సహకారంతో బీజేపీ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలో రెండవ స్థానంలో నిలవగలిగానని మొదటి స్థానంలో నిలిపేందుకు మీ యొక్క సహాయ సహకారాలు ఇలాగే కొనసాగిస్తారని మనస్ఫూర్తిగా కోరుకుంటు సభ్యత్వ నమోదు కోసం కష్టపడి పనిచేస్తున్న ప్రతి కార్యకర్తను పార్టీ గుండెలో పెట్టుకొని చూసుకొంటుందని బూత్ కు 200 లక్ష్యాన్ని పూర్తిచేయాలని తెలిపారు.

## ఆర్ఏంపీ వైద్యం వికటించి

# మహిళ మృతి

**తొలి సమయం, చర్ల, అక్టోబర్ 06**

చర్ల లో ఆర్ఎంపీ వైద్యం వికటించి ఒక మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకున్నది ఎదిరికి చెందిన మహిళ కనితి గంగాభవాని 25 సంవత్సరాలు తనకు





కరకగూడెం వ్యక్తితో వివాహమైనది పిల్లలు లేరు వ్యవసాయ పనుల నిమిత్తం తన స్వగ్రామమైన ఎదిరకు తన తల్లి ఇంటి వద్దకు వచ్చి ఉంటున్నది. అయితే మూడు రోజుల నుంచి ఒంట్లో బాగోక జ్వరంతో బాధపడుతూ చర్లలోని ఒక ఆర్ఎంపీ వైద్యుడు దగ్గరికి వచ్చి వైద్యం చేయించుకుంటున్నది. వైద్యం చేయించుకుంటున్నప్పటికీ జ్వరం తగ్గకపోగా డెంగు జ్వరంతో రక్తకణాలు పడిపోవడంతో ఒక్కసారిగా ఆదివారం సాయంత్రం మహిళ మృతి చెందడం జరిగింది. ప్రభుత్వ అధికారులు పరిధికి మించి వైద్యం చేస్తున్న ఆర్ఎంపీలు ఎవరైతే ఉన్నారో వారి మీద చర్యలు తీసుకోవాల్సిందిగా అక్కడికి వచ్చిన ప్రజలు కోరారు.

# దేశ సమగ్రత,సామాజిక న్యాయం బిజెపితోనే సాధ్యం

**చెన్నమనేని వికాస్ దీప దంపతులు**

**ఘనంగా వేములవాడ రూరల్ మండలంలో బిజెపి సభ్యత్వ నమోదు కార్యక్రమం**





**తొలి సమయం, వేములవాడ, అక్టోబర్ 06**

భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం–2024 లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండల కేంద్రంలోని చెక్కపల్లి గ్రామంలో ఆదివారం సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి డా. చెన్నమనేని వికాస్ దీప దంపతులు హాజరై మాట్లాడుతూ నరేంద్ర మోడీ ఆద్వర్యంలో పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టడం జరుగుతోందని,మోడి భారత దేశాన్ని విశ్వ గురు చేయాలని తపనతో ముందుకు నడుస్తున్నారన్నారు. మనందరం బిజెపిలో చేరి బలోపేతం చేస్తే విశ్వ గురు చేసే ప్రయత్నంలో మనందరి పాత్ర ఉంటుందని ఆశిస్తున్నానుట్లు పేర్కొన్నారు.మోడి అంటేనే త్రీడీ దేశం,ధర్మం, డెవలప్మెంట్, ఆర్టికల్ 370 నీ రద్దు చేసి దేశ సమగ్రతనీ మోడీ కాపాడారని,గత పార్లమెంటు ఎన్నికల్లో 77 లక్షలకు పైగా ఓట్లు వచ్చాయి దాదాపు 50 లక్షల వరకు మెంబెర్స్ ని చేయాలని బిజెపి పార్టీ అధిష్ఠానం సూచన మెరకు వేములవాడ నియోజకవర్గంలో ఎక్కువ శాతం సభ్యత్వ నమోదు అయ్యేలా దిశ నిర్దేశం చేయటం జరిగిందన్నారు. దేశ సమగ్రత,సమృద్ధి,సామాజిక న్యాయం బిజెపితోనే సాధ్యమని, గ్రామాల్లో ప్రజలకి చెప్పి వారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్నామని అన్నారు. ముఖ్యంగా యువతలో చాలా మంచి స్పందన ఉందని,రాబోయే రోజుల్లో తెలంగాణాలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఒక పునాదిల పనిచేస్తుందని స్పష్టం చేశారు.కావున బిజెపిని బలోపేతం చేయాలని కొరడం జరుగుతోందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కుడా ఓటింగ్ శాతం పెరిగి సర్పంచులు,ఎంపీటీసీ లు కావాలని ఆకాంక్షించారు.అనంతరం పార్టీ సభ్యత్వం తీసుకున్న వారికి సభ్యత్వ కార్డులు అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షులు జక్కుల తిరుపతి, మాజీ ఎంపిపి బండ మల్లేశం, ప్రధాన కార్యదర్శులు రవీందర్, పరమేష్ ,మండల పదాధికారులు వివిధ మోర్చాల అధ్యక్షులు నాయకులు,కార్యకర్తలు,పాల్గొన్నారు.

## ఆన్ డ్యూటీలో గుండెపోటుతో

# ఆర్టీసీ డ్రైవర్ మృతి

**కరీంనగర్, సైదాపూర్, అక్టోబర్ 06:** మండలంలోని దుద్దెనపల్లి గ్రామానికి చెందిన ఠాకూర్ రమేష్ సింగ్(46)ఆన్ డ్యూటీలో ఉండగా గుండెపోటు తో మరణించారు. హైద్రాబాద్ లో గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సరస్ (మహిళా ఉత్పత్తులు)కార్యక్రమానికి జమ్మికుంట,వీణవంక, ఇల్లంతకుంట,హుజురాబాద్,సైదపూర్, కేశవపట్నం, మానకొండూరు,మండల సమాఖ్య ప్రతినిధులను హైద్రాబాద్ తీసుకెల్తుండగా, గౌరారం వద్ద టీ తాగి,బస్ ఎక్కిన డ్రైవర్ రమేశ్ సింగ్ ఛాతీలో నొప్పి గా ఉందని బస్ ఇన్చార్జి కి తెలుపగా,వెంటనే 108 కి సమాచారం అందించగా అంబులెన్స్ లో గజ్వేల్ ప్రభుత్వ దవాఖాన లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.43 మంది మహిళలను కాపాడి తన ప్రాణాలు వదిలిన డ్రైవర్ గుర్తు చేస్తూ మహిళలు కన్నీళ్లు పెట్టుకున్నారు.రమేశ్ సింగ్‌కి భార్య మంజుల,ముగ్గురు కుమార్తెలు అర్చన,అఖిల,అన్విత ఉన్నారు.ఇటీవలె ఆయన పరకాల డిపో నుండి హుజురాబాద్ డిపో లో చేరినట్లు సమాచారం.ఆయన మృతి పట్ల కుటుంబ సభ్యులు బోరున విలపించారు.

## సాయి నగర్‌లో ఘనంగా శివ కళ్యాణం

**తొలి సమయం, కరీంనగర్, అక్టోబర్ 06**



కరీంనగర్ పట్టణం సాయి నగర్లో దేవీ నవరాత్రుల మహోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం రోజున స్థానికదుర్గామాత మండపం వద్ద శివ కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కరీంనగర్ బిజెపి అసెంబ్లీ కన్వీనర్ దూబాల శ్రీనివాస్ దంపతులు, కమటం తిరుపతి దంపతులు దుర్గా దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి శివ కళ్యాణం లో పాల్గొన్నారు. ఇట్టి కార్యక్రమంలో సాయి నగర్ దేవి ఉత్సవ కమిటి బాధ్యులు, స్థానిక ప్రజలు, దుర్గా మాత భక్తులు, భవానీలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కొంగాల జలపాతంలో

# యువకుడి మృతి

**విషాదంగా మారిన విహారయాత్ర**

**కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరు**



**తొలి సమయం, వాజేడు, అక్టోబర్ 06**

ఆదివారం సెలవు దినం కావడంతో తన స్నేహితులతో సరదాగా జలపాతాల వద్ద ప్రకృతి రమణీయ దృశ్యాలను తిలకిస్తు ఎంజాయ్ చేస్తూ ఆనందంగా గడపాలని, వచ్చిన మిత్రబృందంలో ఒక యువకుడు, ములుగు జిల్లా వాజేడు మండలం కొంగాల జలపాతం లో మునిగి మృతి చెందాడు .ఈ విషాదకర సంఘటన ఆదివారం ఉదయం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. ములుగు జిల్లా వెంకటాపురం, వాజేడు మండలంలో అనేక జలపాతాలు ప్రకృతి రమణీయ దృశ్యాలతో పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి .అయితే నీటి ప్రమాదాలు జరుగుతుండడంతో, రాష్ట్ర ప్రభుత్వం, ములుగు జిల్లా అధికారులు అటవీశాఖ, వెంకటాపురం, వాజేడు మండలంలోని అనేక జలపాతాలు కు పర్యాటకుల సందర్శనను నిషేధించింది. కేవలం తెలంగాణ నయాగారగా పేరుగాంచిన బొగత జలపాతం ను ములుగు జిల్లా అధికార యంత్రాంగం అటవీశాఖ పర్యటకులకు అనుమతి ఇచ్చింది. అయితే వాజేడు మండలంలోని కొంగాల జతపాతం ను పర్యటకులకు, సందర్శనలు ప్రభుత్వం నిషేధించింది. ఈ మేర కు జగన్నాథపురం వద్ద అటవీ శాఖ సిబ్బందితో కొంగాల వెళ్ళే రోడ్డును మూసివేసి చెక్ పోస్ట్ ని ఏర్పాటు చేశారు. వేరే దొంగ మార్గం గుండా కొంతమంది స్థానికుల సహాయంతో, అడవి మార్గం గుండా ఆదివారం గోదావరిఖని పట్టణ ప్రాంతానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులు దొడ్డిదారిన కొంగాల జలపాతం చేరుకున్నారు. జలపాతం లో బి.అభినవ్ (18 సంవత్సరాలు) అనే ఇంజనీరింగ్ విద్యార్థి తాడిచెట్టు లోతు జల ప్రమాణంలో ఉన్న జలపాతం లో స్నానానికి , దిగి ఈత రాక మునిగి పోయాడు. సమాచారం తెలుసుకున్న వాజేడు పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ రుద్ర హరీష్, అటవీశాఖ సిబ్బంది గజ ఈతగాళ్ళు తో జలపాతం మడుగులో గాలించారు. ఇంజనీరింగ్ విద్యార్థి అభినవ్ మృతదేహాన్ని గజ ఈతగాళ్లు వెలికి తీశారు. సమాచారం తెలుసుకున్న మృతుడి తల్లిదండ్రులు విహారయాత్ర కని వెళ్లి విగత జీవుగా మారాడని నిండు నూరేళ్లు నిండిపోయాయని, మృతదేహంపై కన్నీరు మున్నీరుగా వినిపిస్తూ ఉండడం సూపరులను కంటి తడి పెట్టించింది .ఈ మేరకు వాజేడు ఎస్.ఐ.రుద్రహరీష్ కేసు నమోదు చేసి విద్యార్థి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్.ఐ. మీడియా తెలిపారు. అనుమతి లేని జలపాతాల వద్దకు ఎవరు వెళ్ళవద్దని, హెచ్చరికలు జారీ చేస్తున్న దొంగ మార్గంలో వెళ్లి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని, జలపాతాల వద్దకు వెళ్ళవద్దని, ఈ సందర్భంగా పోలీసు , అటవీ శాఖ అధికారులు పర్యటకులను కోరారు.

# సామాన్యులే సమిధలు..

**ఇజ్రాయెల్-హమాస్ యుద్ధానికి నేటితో ఏడాది**

**ఇంకా 97 మంది బందీలు హమాస్ చెరలోనే**

**యుద్ధంలో దాదాపు 42 వేల మంది మృతి**

**తొలి సమయం హైదరాబాద్,**

ఇజ్రాయెల్‌పై హమాస్ మిలిటెంట్లు మెరుపుదాడి చేసి నేటికి సరిగ్గా ఏడాది! పగబట్టిన పాములా.. హమాసను నిర్మూలించడమే లక్ష్యంగా.. సంవత్సర కాలంగా గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ సేనలు బాంబుల వర్షం కురిపిస్తూనే ఉంది!! హమాసకు అండగా నిలిచిన హిజ్బుల్లా, హౌతీ తదితర ఉగ్రమూకలకూ ఊపిరిసలపని రీతిలో పోరాటాన్ని కొనసాగిస్తోంది! ఏడాది కాలంగా ఆరని చిచ్చులా కొనసాగుతున్న ఈ యుద్ధానికి కారణాలేంటంటే.. ఎవరి వాదన వారిది! ఎవరి వాదన ఎలా ఉన్నా.. దున్నల పోరులో దూడలు నలిగిపోయి నట్టు.. యుద్ధంలో అంతిమంగా ఓడిపోయేది, అత్యధికంగా చచ్చిపోయేది.. అభం శుభం తెలియని సామాన్య ప్రజలే! మరీ ముఖ్యంగా మహిళలు, చిన్నారులు ప్రధాన బాధితులు! ఈ యుద్ధంలోనూ అదే జరుగుతోంది. సరిగ్గా ఏడాది క్రితం 2023, అక్టోబరు 7న.. 'సింహత్ తోరా' సెలవు దినాన్ని ఆనందంగా గడపడానికి ఇజ్రాయెలీలందరూ సిద్ధమై ఉండగా హమాస్ మిలిటెంట్లు ఆ దేశంపై 4300కుపైగా రాకెట్ల వర్షం కురిపించారు!! కొంతమంది మిలిటెంట్లు వాహనాల్లో భూమార్గాన.. మరికొందరు పారా గ్లైడర్ల సాయంతో గగనతలం గుండా.. సరిహద్దు దాటి ఇజ్రాయెల్‌లోకి చొరబడి దొరికినవారిని దొరికినట్టు చంపేసి ఊచకోత కోశారు! దాదాపు 7000 మంది మిలిటెంట్లు 119 చోట్ల సరిహద్దులను దాటి విధ్వంస కాండ కొనసాగించారు. వారి దాడుల్లో 1139 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 38 మంది చిన్నారులు సహా 695 మంది ఇజ్రాయెల్ పౌరులు, 71 మంది విదేశీయులు, 373 మంది ఇజ్రాయెల్ భద్రతా సిబ్బంది ఉన్నారు. చనిపోయినవారిలో ఎక్కువ మంది (364 మంది) సరిహద్దులకు సమీపంలో జరిగిని నోరా ఫెస్టివల్‌కు హాజరైనవారే! అలా యుద్ధం మొదలుపెట్టిన హమాస్ మిలిటెంట్లు.. ఇజ్రాయెల్ వద్ద బందీలుగా ఉన్న పాలస్తీనియన్లను విడిపించుకోవడానికి 30 మంది చిన్నారులు సహా 251 మందిని తమతోపాటు బందీలుగా గాజా స్ట్రిప్‌కు తీసుకెళ్లి పోయారు. దీనికి ప్రతిగా ఇజ్రాయెల్ ఏడాదికాలంగా చేస్తున్న యుద్ధంలో.. కురిపించిన బాంబుల వర్షంలో.. ఆదివారం (2024, అక్టోబరు 6) నాటికి 41,825 మంది పాలస్తీనా ప్రజలు చనిపోయారు!

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101